# రెడ్ అలర్ట్!!



- నగరంలో భారీ వర్షాల నేపథ్యంలో జిహెచ్ఎంసి హెచ్చరిక
- రెండు రోజలపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం
- అత్యవసరమైతేనే బయటకు రావాలని నగరవాసులకు సూచన
- ఐటీ ఉద్యోగుల పనివేళల్లో మార్పులు, మూడుదశల్లో లాగ్-ఔట్



హైదరాబాద్, జూలై 26,ప్రభాతవార్త: హైదరాబాద్ సహా తెలంగాణ ప్రాంతంలో భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ వాసులను జిహెచ్ఎంసి అప్రమత్తం చేసింది. ఈమేరకు నగరంలో హైఅలర్ట్ జారీ చేసింది. నగరవాసులు అత్యవసరమైతే తప్పా బయటకు రావద్దని అధికారులు సూచించారు. ఏదైనా అవసరమైతే 9000113667, 040-21111111 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. అందుకు నగరవాసులకు ఎస్ఎంఎస్ పంపడంతోపాటు సోషల్‌మీడియా, మీడియా ద్వారా అప్రమత్తం చేశారు. బుధవారం, గురువారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. 24గంటల్లో తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సైబరాబాద్ సిపి స్టీఫెన్ రవీంద్ర సూచించారు. ఇదిలా ఉండగా భారీ వర్ష సూచన నేపథ్యంలో ఐటీ ఉద్యోగుల పనివేళల్లో మార్పులు చేసిన విషయం తెలిసిందే. లాగ్-ఔట్‌ను మూడు ఫేజ్‌లుగా విభజించి తొలుత బుధవారం వరకే పరిమితం చేయగా ఆతర్వాత ఆగస్టు 1వరకు పొడిగించారు. మూడుదశల్లో ఐటీ ఉద్యోగులు లాగ్ఔట్ కావాలని సూచించారు. ఐకియా నుంచి సైబర్ టవర్స్ వరకు ఉండే ఐటీ కార్యాలయాలు సాయంత్రం 3గంటలవరకు, ఐకియా నుంచి బయోడైవర్సిటీ ,రాయదుర్గం వంరకు ఉండే కార్యాలయాలు సాయంత్రం 4.30కు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ,గచ్చిబౌలి ప్రాంతాల్లో ఉండే ఐటీ కార్యాలయాల ఉద్యోగులు సాయంత్రం మూడు గంటలకు లాగ్ఔట్ చేయాలని సూచించింది.



## హైదరాబాద్ వార్త

# జంట జలాశయాలకు పోటెత్తుతున్న వరద నీరు

### గండిపేట జలాశయం గేట్లు ఎత్తిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

### లంగర్‌హౌస్‌లో ఉధృతంగా పారుతున్న మూసీనది

### లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

నార్సింగి, జూలై 25 ప్రభాతవార్త : హైదరాబాద్ మహా నగరానికి దశాబ్దాలుగా మంచినీటిని అందిస్తున్న జంట జలాశయాలకు వరద నీరు పోటెత్తుతుంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఈ రెండు జలాశయాలలోకి వరద నీటిని మోసుకు వచ్చే వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. వికారాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, మోమిన్‌పేట్, మొయినాబాద్, శంషాబాద్ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాల వలన వరదనీరంతా వాగుల్లోకి కలిసి జంట జలాశయాలలోకి వచ్చి చేరుతుంది. బుధ,గురు వారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో జల మండలి అధికారులు ముందు జాగ్రత్తగా గండిపేట జలాశయం గేట్లు ఎత్తి వరద నీటిని మూసీలోకి వదిలిపెట్టారు. గండిపేట జలాశయం పూర్తి సామర్థ్యం 1790 అడుగులు(3.90.టిఎంసి)లు కాగా బుధవారం సాయంత్రానికి 1787.15.అడుగుల నీరు వచ్చి చేరింది. ఇంకా 3.అడుగుల నీరు తక్కువగా ఉండగానే గేట్లు ఎత్తడం ఏమిటని గండిపేట మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎగువ ప్రాంతాల్లో ప్రభుత్వంలోని ముఖ్య నాయకుల ఫాంహౌస్‌లు, నిర్మాణాలలోకి నీరు రాకుండా ఉండాలనే ముందుగా గేట్లు ఎత్తారన్న చర్చలు జరుగుతున్నాయి. గండిపేటలోకి 800.క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా 7,9.గేట్లను ఒక అడుగు మేర ఎత్తి దిగువకు 216.క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే హిమాయత్ సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1763.50.అడుగులు(2.970టిఎంసిలు)కాగా బుధవారం సాయంత్రానికి 1761.20అడుగుల నీరు ఉంది. 1200.క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా 2గేట్లు 2ఫీట్ల మేర ఎత్తి దిగువకు 1350.క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలి పెడుతున్నారు.



**గేట్లు ఎత్తిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్..** గండిపేట జలాశయం 7,9.గేట్లను 2.అడుగుల మేర ఎత్తి నీటిని మూసీ వాగులోకి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా నియోజకవర్గంలోని జంట జలాశయాలు నిండుకుండల్లా మారడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ జలాశయాలలోని నీటిని నగర ప్రజలకు వదులకుండా అలాగే నిలువ ఉంచడం వలన మా ప్రాంతంలో భూగర్భ నీటి మట్టం పెరిగి, ఇళ్లల్లోని బోర్లు వేసవిలో సైతం ఎండిపోకుండా నీళ్లె పోశాయన్నారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో ఆలోచించి కృష్ణా, గోదావరిల నుంచి మంచినీటిని తెచ్చి సరఫరా చేయించడం వలన గండిపేట, హిమాయత్ సాగర్ జలాశయాల నీటిని నగరానికి వదులడం లేదన్నారు. సమైక్య పాలనల్లో ఈ జంట జలాశయాలు ప్రతిఏటా నీరింకిపోయి నెర్రెలు పారేవని, ఇప్పుడు ఏ కాలంలో చూసినా నిండుకుండల్లా ఉంటూ కనుల విందు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గండిపేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు నర్సిహ్మా, నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ రేఖ యాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, కౌన్సిలర్లు శివారెడ్డి, ప్రవీణ్, నాయకులు గణేష్, ప్రశాంత్ యాదవ్, రాజు యాదవ్, జల మండలి జిఎం దేవిడ్‌రాజు, డిజిఎంలు నరహరి, రేణుకలు పాల్గొన్నారు.



గండిపేట జలాశయం 7,9.గేట్ల నుంచి మూసీలోకి వస్తున్న వరద నీరు, గండిపేట జలాశయం గేట్లు ఎత్తుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**ఉధృతంగా పారుతున్న మూసీనది..** గండిపేట, హిమాయత్ సాగర్ రెండు జలాశయాల గేట్లు ఒకేసారి ఎత్తి దిగువకు వరద నీటిని వదులడం వలన లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద మూసీనది ఉధృతంగా పారుతుంది. ఈ నదిని చూసేందుకు బాపూఘాట్ బ్రిడ్జిపై వందలాది మంది సెల్ఫీలు, ఫొటోలు, వీడియోలు చూసేందుకు ఎగబడ్డారు. దీంతో సాయంత్రం సమయంలో ట్రాఫిక్ జాం ఏర్పడింది. గలగలా పారుతూ, పరవళ్లు తొక్కుతూ వేగంగా పారుతున్న మూసీ అందాలు చూసి సందర్శకులు ఆనందపరవశులవుతున్నారు.

**అప్రమత్తంగా ఉండండి..** మూసీనది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడం వలన ముందు జాగ్రత్తగా ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. గత వారం రోజుల నుంచి మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలకు నిత్యం హెచ్చరికలు చేస్తున్నారు.

# కళాకారులను గౌరవించడం మంచి సంప్రదాయం

### తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త

చిక్కడపల్లి, జూలై 26 ప్రభాతవార్త: తెలుగు ప్రజలకు ఆరాధ్య నటులు ఎస్వీ.రంగారావు, నటి సౌందర్య అని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. వంశీ ఇంటర్నేషనల్ ఆశీస్సులతో కళానిలయం సాంస్కృతిక సేవా సంస్థ అధినేతలు సురేందర్, పుష్పలత ఆధ్వర్యంలో సినీనటిమణి బేబి రాణికి 'ఎస్వీ రంగారావు పురస్కారం ప్రదానోత్సవ కార్యక్రమం బుధవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో ప్రముఖ గాయనీ, భీమన సాహితీ నిధి అధినేత్రి హైమావతి బీమన్న అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథులుగా తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త, వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు చేతులమీదుగా అందించారు. పాప కోసం, బంగారు పాప తదితర చిత్రాలలో బాలనటిగా ఎస్వీ.రంగారావుతో నటించిన బేబి రాణిని గుర్తించి సత్కరించడం విశేషమన్నారు. నాటి వారి ప్రతిభను నేటితరాలకు పరిచయడం చేసే కార్యక్రమాలు తరచూ జరగాలన్నారు. వంశీ రామరాజు మాట్లాడుతూ వైవిధ్య కార్యక్రమాలకు కళానిలయం సంస్థ గుర్తింపు తెచ్చుకున్నదన్నారు. విశ్వనటచక్రవర్తి ఎస్వీ.రంగారావు 105వ జయంతి సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా నిరామత, నటులు, 'మా' సభ్యుడు డాక్టర్ ఎంఆర్.చౌదరి వడ్లపట్ల, సినీ నిర్మాత మురళీధర్, సినీ నిర్మాత డాక్టర్ సిహెచ.బద్రినాథ్, మేడిది సుబ్బయ్యట్రస్ట్ అధ్యక్షుడు ఎంవి.రావు, సంఘసేవకులు మునిరాజ గుత, ప్రముఖ దర్శకులు ఎల్.సంజీవరెడ్డి, ప్రముఖ దర్శకులు శివనాగు, మాగంటి రాజేంద్రబాబు, బిజెపి నేత వంశీ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సినీ సంగీత విభావరి కార్యక్రమంలో గాయకుడు బాపిరాజు నిర్వహణలో సాగింది.

# చిక్కడపల్లి శ్రీవారి హుండి ఆదాయం రూ.28లక్షల17వేల481



హుండి లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి, జూలై 26 ప్రభాతవార్త: చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి హుండి లెక్కింపు కార్యక్రమం బుధవారం స్వామివారి సన్నిధిలో జరిగింది. ఆలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, ఆలయం ఈవో కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ లెక్కింపుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణాధికారిగా హాజరయ్యారు. మొత్తం నాలుగు నెలల 6 రోజులకుగాను రూ.28లక్షల17వేల481 రూపాయల ఆదాయం వచ్చింది. దేవాలయం అభివృద్ధి భక్తులు, ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

# మనస్తాపంతో గృహిణి బలవన్మరణం



ఆత్మహత్య చేసుకున్న బోయిని శ్రీదేవి

జీడిమెట్ల, జూలై 26 ప్రభాతవార్త: ఆర్థిక సమస్యలతో నిరాశ నిస్పృహకు లోనైన ఓ గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. సూరారం లక్ష్మీనగర్ మెట్కాన్‌గూడకు చెందిన బోయిని శ్రీదేవి(39), భర్త మహేష్‌తో కలిసి నివసిస్తోంది. అయితే శ్రీదేవి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ తీవ్ర ఆందోళనకు గురై డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయింది. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి మచ్చ లత తన కూతురి ఆత్మహత్యకు గల కారణాలు తనకు తెలియాలని సూరారం పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# పాతబస్తీలో మొహర్రంకు అన్ని ఏర్పాట్లు చేయాలి



సౌత్ జోన్ డిసిపి పి.సాయి చైతన్యకు వినతి పత్రం అంద జేస్తున్న సీనియర్ బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్,జూలై 26 ప్రభాతవార్త : మొహర్రం సందర్భంగా పాతబస్తీలో అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతూ రాష్ట్ర మాజీ బిజెపి అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ బుధవారం దక్షిణ మండలం డిసిపి పి.సాయి చైతన్యను కలిసి వినతి పత్రం అందజేశారు.పాతనగరంలో మొహర్రం ను పురస్కరించుకుని పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని డిసిపిసాయి చైతన్య తెలిపారు.సీనియర్ బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ మాట్లాడుతూ మొహర్రం సందర్భంగా అన్ని వసతులు కల్పించాలని కోరుతూ కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి జిహెచ్ఎంసి,విద్యుత్, ఆర్‌టిసి, ట్రాఫిక్,పోలీస్ విభాగాలకు లేఖలు రాసారని తెలిపారు.పాతబస్తీకి చెందిన పలువురు షియా ముస్లిం ప్రతి నిధులు పాల్గొన్నారు.

# 28న ఉజ్జయినీ మహాకాళి అమ్మవారికి సాక

బేగంపేట జులై 26,ప్రభాతవార్త : సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో ఆషాడ బోనాల జాతర రంగం కార్యక్రమంలో భవిష్యవాణి వినిపించిన సమయంలో అమ్మ వారు తనకు ఐదు (శుక్రవారాలు) వారాల పాటు సాక పాయాలని అడిగిన నేపథ్యంలో ఈ నెల 28వ తేదీన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈ ఓ గుత్తా మనోహార్ రెడ్డి తెలియజేసారు.ఈ సందర్భంగా అమ్మ వారికి సాక సమర్పించాలని అనే భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మ వారి కృపా కటాక్షాలకు పాత్రులు కావాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయంలో పటిష్టమైన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టనున్నట్లు ఈ ఓ తెలిపారు.

# నత్తనడకన ఎలివేటెడ్ కారిడార్ పనులు

### బురదమయంగా రోడ్డు ▲ వాహనదారుల ఇక్కట్లు



ఉప్పల్, జూలై 26 ప్రభాతవార్త : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయలోపం కారణంగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఒక వైపు కారిడార్ పనుల కోసం గుంతలు తవ్వడం, మరోవైపు రోడ్లు అధ్వాన్నంగా మారడంతో గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉప్పల్ వరంగల్ రహదారి బురదమయంగా మారిపోయింది. పాలకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2018లో కేంద్ర ప్రభుత్వం ఉప్పల్ నుంచి నారపల్లి వరకు సుమారు 6.2 కి.మీ పరిధిలో రూ.675 కోట్ల వ్యయంతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు నిర్ణయించింది. ఇదే క్రమంలో రామంతాపూర్ పబ్లిక్ స్కూల్‌లో అప్పటి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా పనులకు భూమి పూజ చేశారు. రహదారి విస్తరణ, భూసేకరణ, పరిహారం చెల్లింపులు రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సి ఉంది. కారిడార్ నిర్మాణం కేంద్ర ప్రభుత్వం నియమించిన గాయత్రి సంస్థ పనులు చేపట్టింది. పనులు తీసుకునే సమయంలో 18 నెలల్లో పూర్తి చేస్తామని కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకుంది. ఇదే క్రమంలో ఏనిదేళ్ల క్రితం ఉప్పల్ నుంచి నారపల్లి వరకు కారిడార్ చేపట్టేందుకు నిర్ణయించారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి భూసేకరణ, రహదారి విస్తరణ ఆలస్యం కావడం, సకాలంలో భూమి సేకరించి అప్పగించకపోవడంతో కారిడార్ పనులు ఆలస్యంగా ప్రారంభం అయ్యాయి. నారపల్లి నుంచి కొంత వరకు పనులు చేసిన కాంట్రాక్టర్లు సగం వరకు పనులు చేసిన తర్వాత కరోనా సమయంలో రెండేళ్ల పనులు నిలిపివేశారు. దీంతో రేట్లు పెరిగిపోవడం, పనుల అంచనాలు మారిపోవడంతో కాంట్రాక్టర్ పనులు చేసేందుకు అసక్తి చూపలేదు. కాంట్రాక్టర్ నత్తనడకన పనులు చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు అప్పట్లో పట్టించుకోలేదు. దీంతో సగం వరకు పనులు జరిగి ప్రస్తుతం అధ్వాన్నంగా మారిపోయింది.

**గుంతలు పూడ్చే పనిలో ట్రాఫిక్ పోలీసులు..** పనులు చేయాల్సిన ఆర్అండ్‌బి అధికారులు పత్తా లేకుండా పోయారు. వాహనదారులు పడుతున్న ఇబ్బందులు చూసిన పోలీసులు తామే మట్టి పోసే పనిలో నిమగ్నం అయ్యారు. ఇటీవల కురిసిన వర్షానికి పలు చోట్ల జాతీయ రహదారి గుంతలమయంగా మారడంతోపాటు ఉప్పల్ బస్టాండ్ వద్ద మురుగునీటి కాలువ చెత్తచెదారంతో పూడుకునిపోయి రోడ్డుపై నీరు చేరింది. దీంతో రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై జిహెచ్ఎంసి, ఆర్అండ్‌బి అధికారులకు స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. అయినప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదు. అయితే ఈ రహదారిలో ట్రాపిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసులకు గుంతల రోడ్డు పూడ్చిస్తే ట్రాపిక్ సమస్య కొంత వరకు మెరుగుపడుతుందని భావించారు.



అధ్వాన్నంగా తయారైన ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారి, ఉప్పల్ నుంచి నారపల్లి రహదారిలో బురదమయంగా మారిపోయిన దృశ్యం

**పత్తాలేని ఆర్అండ్‌బి, జిహెచ్ఎంసి అధికారులు..** వరంగల్ జాతీయ రహదారి పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నచందంగా మారింది. ఆర్అండ్‌బి అధికారులు గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అదే విధంగా పలు చోట్ల డ్రైనేజీ నీరు జాతీయ రహదారిపైకి చేరి రోడ్లు దెబ్బ తింటున్నాయి. దీనిపై తాము జిహెచ్ఎంసికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆర్అండ్‌బి శాఖ అధికారులు ఆరోపిస్తున్నారు. కిందిస్థాయి సిబ్బందితో మట్టిపోయిస్తూ తూతూమంత్రంగా అధికారులు పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఉప్పల్ బస్టాండ్ వద్ద గత రెండు నెలలుగా మురుగునీరు రహదారిపైకి వచ్చి స్థానికులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఇంత వరకు ఆ ప్రాంతాన్ని సందర్శించకపోవడం గమన్హార్హం. ఎంతో మంది బడా నేతలు ఇదే రహదారిలో ప్రయాణించినా మన అధికారులు పట్టించుకోలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కాగా రెండు రోజుల క్రితం పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి సిఎం కెసిఆర్ దృష్టికి సమస్య తీసుకుని రావడంతో తాత్కాలికంగా రోడ్డు వేసేందుకు నిర్ణయించినట్లు బిఆర్ఎస్ నేతలు చెబుతుండగా, రోడ్డు మరమ్మతులకు తామే నిధులు మంజూరు చేయించామని బిజెపి నేతలు పేర్కొంటున్నారు. ఈ పనులు ప్రారంభం అయ్యే వరకు ప్రజలకు అవస్థలు తప్పవు.

# ఆనంద్‌గల్లీలో కొత్త రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలి



ఆనంద్‌గల్లీలో సగం వరకు రోడ్డు వేసిన చిత్రం

చార్మినార్, జూలై 26 ప్రభాతవార్త : పాతబస్తీ ఘాన్సీబజార్ డివిజన్ పరిధిలోని ఆనంద్‌గల్లీలో సగం వరకు మాత్రమే జిహెచ్ఎంసి అధికారులు కొత్త రోడ్డును ఏర్పాటు చేశారు.మిగతా రహదారిలో రోడ్డును నిర్మించకుండ వదిలి వేశారు.దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.జిహెచ్ఎంసి అధికారులు ఆనంద్‌గల్లీలో కొత్త రహదారి ఏర్పాటు కోసం రోడ్డు తవ్విన రెండు నెలలు తర్వాత కొంత వరకు మాత్రమే సిసి రోడ్డును నిర్మించారు.స్థానికులు ప్రజలు ఎన్నో విజ్ఞప్తులు చేసిన అనంతరం అధికారులు కొత్త రహదారిని ఏర్పాటు చేశారు.రహదారి తవ్విన మొత్తం స్థలంలో రోడ్డును నిర్మించకుండ కేవలం సగం రహదారిలో మాత్రమే సిసి రోడ్డును ఏర్పాటు చేశారు.మిగత రహదారిలో రోడ్డును ఏర్పాటు చేయనందున స్థానిక ప్రజలు గుంతలలో జారిపడి గాయాల పాలవుతున్నారు. నిత్యం ఆనంద్‌గల్లీ రహదారిలో వేలాది మంది ప్రజలు పలు ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారు. రహదారి నిర్మాణం కోసం తవ్విన గుంతలలో వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలు బారిన పడుతున్నారు.దాదాపు రెండు నెలలు క్రితం కొత్త సిసి రోడ్డు ఏర్పాటు కోసం జిహెచ్ఎంసి అధికారులు రహదారిని తవ్వి కేవలం సగం వరకు మాత్రమే సిసి రోడ్డును వేసి మిగత రోడ్డును ఏర్పాటు చేయకపోవటం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఘాన్సీబజార్ డివిజన్ పరిధిలోని ఆనంద్‌గల్లీలో కొత్త రహదారి పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# మాదిగల సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం త్వరలో మాదిగ డిక్లరేషన్

### ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌ను ప్రవేశపెట్టాలి

### మాదిగ మేధావుల ఫోరం రాష్ట్ర కమిటీ

చిక్కడపల్లి జూలై 26 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌ను ప్రవేశపెట్టాలని మాదిగ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మాదిగ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఫోరం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పల్లెల వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ నతానియేలు, కోశాధికారి బెజ్జంకి రాంబాబు, ఉపాధ్యక్షులు ఎం.నర్సయ్య, ఆనంద్, ఎస్సీ,ఎస్టీ ఫోరం నాయకులు ఆరేపల్లి రాజేందర్, ఎం.శ్రీనివాస్, పవన్‌కుమార్, ప్రొఫెసర్ అంజయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫోరం నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని, రాత్రికి రాత్రే ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన మోదీ ప్రభుత్వం గత 30 సంవత్సరాలుగా జరుగుతున్న వర్గీకరణ ఉద్యమానికి స్పందించకపోవడం, బిజెపి అధికారంలోకి రాగానే వందరోజుల్లో వర్గీకరణ చేస్తామన్న హామీ మరిచారన్నారు. ఇప్పటికైనా మాదిగ ఉపకులాలకు 12శాతం కేటాయించాలని, వర్గీకరణ పేరుతో ఓటు బ్యాంక్ రాజకీయాలు చేసే పార్టీలను, కుట్రలను గమనించాలని పిలుపునిచ్చారు. మణిపూర్ ఆదివాసీలపై దాడులను, అత్యాచారాలను వెంటనే నిలిచిపోయేటట్లు కేంద్రం రక్షణ చర్యలు తీసుకోవాలని, రక్షణ కల్పించడంతో పాటు ఆదివాసీల అస్థిత్వానినన కాపాడాలని, కేంద్రం చేస్తున్న కుల,మత విభజన రాజకీయాలను నిలిపివేయాలని, ఎస్సీ,ఎస్టీ,మైనారిటీలపై జరుగుతున్న దాడులపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే కమిటీ నియమించాలని, ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అన్నిరాజకీయ పార్టీలు సహకరించాలని, ఇందుకు తెలంగాణ సిఎం కెసిఆర్ చొరవచూపాలని డిమాండ్ చేశారు. మాదిగల సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం ఫోరం ఆధ్వర్యంలో 'మాదిగల డిక్లరేషన్'ను త్వరలో ప్రకటించాలని సమావేశం నిర్ణయించింది. మాదిగలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకు అధికారం వచ్చేవిధంగా మాదిగలు మద్దతుగా నిలుస్తారని, విస్మరించే పార్టీలను ఓడించటానికి మాదిగలు ఉన్నారని పేర్కొన్నారు.



ప్రసంగిస్తున్న మాదిగ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమా శ్రీనివాస్, పల్లెల వీరస్వామి

## వరద సమస్యలను పరిష్కరించిన అధికారులు

సికింద్రాబాద్, జూలై 26 ప్రభాతవార్త : ఐదారు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వార్షాల వల్ల బన్సీలాల్‌పేట్ డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు డివిజన్ అధ్యక్షుడు ఎల్. వెంకటేషన్ రాజు న్యూబోయిగూడ, జైనగర్ కాలనీ, వడ్డెరబస్తీలలో పర్యటించారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదులతో పాటు డ్రైనేజీ సమస్య, తాగునీటి పైప్‌లైన్ సమస్యలు, మంత్రి సూచనల మేరకు నూతన తాగునీటి కనెక్షన్‌ల విషయమై ఆరా తీశారు. జలమండలి అధికారులతో స్థానికంగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శివశంకర్, ముఖేష్, జయేందర్‌రెడ్డి, నేతలు వెంకటరమణ, మక్కల నర్సింగ్, మహేష్, బాలరాజు, శివకుమార్, కుమార్ యాదవ్, కొత్తూరు వెంకటేష్, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

## మందకృష్ణను సన్మానించిన నాయకులు



నాగులూరి సాయిబాబాను
మర్యాదపూర్వకంగా కలిసిన మందకృష్ణమాదిగ

సికింద్రాబాద్, జూలై 26 ప్రభాతవార్త : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ప్రముఖ పారిశ్రామిక వేత్త, సంఘ సేవకుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగులూరి సాయిబాబాను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సికింద్రాబాద్ నియోజకవర్గ రాజకీయాలతో పాటు మాదిగ రిజర్వేషన్ బిల్లు, దళితులకు రాజకీయ ప్రాధాన్యత, స్థానిక సమస్యలు, ప్రాంతీయతత్వం తదితర అంశాలపై సుమారు గంటకు పైగా చర్చించారు. పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి మందకృష్ణను ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన తనను మందకృష్ణ మాదిగ మర్యాదపూర్వకంగా కలిసి సంఘీభావం ప్రకటించారని నాగులూరి సాయిబాబా తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు దళిత సంఘాల ప్రతినిధులు, ఎమ్మార్పీఎస్ నేతలు పాల్గొన్నారు.

## యువతులు అన్ని రంగాలలో రాణిస్తున్నారు




షీ టాక్స్ కార్యక్రమంలో మాట్లాడుతున్న క్రిశాంక్

కంటోన్మెంట్, జూలై 26 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్ కంటోన్మెంట్ 5వార్డులోని కాకగూడ కమ్యూనిటీహాల్‌లో 7వ షీటాక్స్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. దాదాపు 30 మంది యువతులతో ముచ్చటించారు. బహుళజాతి కంపెనీలలో ఉపాధి అవకాశాలు, వ్యవస్థాపకత, స్వయం ఉపాధి, మహిళా సాధికారణ గురించి చర్చించారు. ఈ సందర్భంగా క్రిశాంక్ మాట్లాడుతూ కంటోన్మెంట్ కోసం యువతులు తమ ఆలోచనలు పంచుకున్నారని, వారి ఆలోచనలను వినడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. భారీ వర్షాలు కురుస్తున్నప్పటికి కార్యక్రమంలో యువతులు పాల్గొనడం వారి పట్టుదల స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో దివ్య, సంకీర్తన, ఝాన్సీ, రమ్య, భాను, లోహిత, సుస్మిత, శిరీష, యశస్విని, శ్రీలక్ష్మీ, ఐశ్వర్య, కీర్తన, మోనిక తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ నాయక్‌నగర్‌లో కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం



స్థానికులతో మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

జీడిమెట్ల, జూలై26 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్ పరిధి ఎస్ఆర్ నాయక్‌నగర్‌లోని జనప్రియ అపార్ట్‌మెంట్స్ వద్ద రూ.35లక్షల నిధులతో కల్వర్టు నిర్మాణ పనులను బుధవారం మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జనప్రియ అపార్ట్‌మెంట్ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ సురేష్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. అనంతరం సురేష్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఎల్లప్పుడు ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నానని,అపార్ట్‌మెంట్ వాసులు డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తన దృష్టికి రావడంతో కల్వర్టు నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. ఈ కల్వర్టు నిర్మాణంతో అపార్ట్‌మెంట్ వాసులసమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## 'కార్గిల్ విజయ్ దివస్' సందర్భంగా సైనిక అమరవీరులకు ఘన నివాళి

చిక్కడపల్లి, జూలై 26 ప్రభాతవార్త: భారతదేశంలో పాకిస్తాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా విరోచిత పోరాటం చేసిన సైనికులు విజయం సాధించి మన జాతీయ పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించిన రోజే కార్గిల్ విజయ దినోత్సవం అని వక్తలు పేర్కొన్నారు. దేశ భద్రత కోసం సరిహద్దుల్లో కంటికి రెప్పలా కాపలా కాస్తూ శతృదేశ సైనిక తూటాలకు ఎదురొడ్డి నిలిచి నిర్విరామంగా పోరాడి కశ్మీర్‌లో విజయకేతనం ఎగురవేశారని అన్నారు.



ముసారంబాగ్ బ్రిడ్జ వద్ద మలేరియా సిబ్బంది తొలగిస్తున్న చెత్తా, చెదారం పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్

## మంపు ప్రాంతాలలో కాంగ్రెస్ నాయకుల పర్యటన



వరద ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్,జూలై 26 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముంపు ప్రాంతాలను బుధవారం కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ హైదరాబాద్ జంట నగరాలను డల్లాస్, కెనడా, వాషింగ్టన్ నగరాలకంటే విశ్వనగరంగా తీర్చిదిద్దామని ప్రగల్భాలు పలుకుతున్నాడని మండిపడ్డారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు జంట నగరంలో ఎక్కడ చూసినా వరద నీటితో ఇబ్బందులు పడుతున్నారని, ఎక్కడ చూసినా రోడ్లపై గుంతలతో అధ్వాన్నంగా తయారయ్యాయన్నారు. మంత్రి కేటీఆర్ ఇప్పటికైనా వాస్తవాన్ని గ్రహించి జంట నగరాల్లోని ముంపు ప్రాంతాల్లో పర్యటించాలని సవాల్ విసిరారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు చెరువులను కబ్జా చేయడంతో కాలనీలు నీట మునిగాయని మండిపడ్డారు. ఇప్పటికైె వరద ముంపు ప్రాంతాలను అధికారులు, ప్రజా ప్రతినిధులు పర్యవేక్షించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవడం శోచనీయం

**తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

ధర్నాచౌక్, జూలై 26, ప్రభాతవార్త: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై సుప్రీంకోర్టు స్పందించే వరకు కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవటం శోచనీయమని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన కవాడిగూడలో విలేఖరులతో మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలకు మన దేశం ప్రపంచ దేశాల ముందు తలదించుకునే పరిస్థితి ఏర్పడిందని, మణిపూర్ కూడా మన దేశంలోని ఒక భాగమనే విషయం కేంద్ర ప్రభుత్వం గుర్తించకపోవటం దురదృష్టకరమని అన్నారు. మనం ఇంకా ఆటవిక, అనాగరిక దేశంలోనే బతుకుతున్నామనటానికి మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలే ఉదాహరణలని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్ ఘటనలపై ప్రధాని మోదీ ముందే తగిన రీతిలో స్పందించి ఉంటే ఇన్ని అవమానీయ ఘటనలు జరిగి ఉండేవి కావని అన్నారు. దేశంలోని మైనారిటీలు, తెగలు, ఆదివాసీలు ఈ దేశంలో తమకు రాజ్యాంగ బద్ధంగా, పార్లమెంటు ద్వారా తమకు రక్షణ కలుగుతుందనే భరోసాతో బతుకుతూ ఉంటే ప్రధాని మోదీ వారి నమ్మకాన్ని వమ్ము చేశారని, ఇది ముమ్మాటికీ రాజ్యాంగాన్ని, రాజధర్మాన్ని త్రునీకరించటమేనని స్పష్టం అన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

కౌన్సిలర్ శంభీపూర్‌క్రిష్ణ



కాలనీలో పర్యటిస్తున్న కౌన్సిలర్ శంభీపూర్‌క్రిష్ణ

దుండిగల్, జులై 26 ప్రభాతవార్త : ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో బుధవారం 26వ వార్డులోని వివిధ కాలనీలలో స్థానిక కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ పర్యటించారు. ఈసందర్భంగా వరదనీరు నిల్వ ఉన్న ప్రాంతాలతో పాటు గుంతలమయంగా మారిన రోడ్లను పరిశీలించి వెంటనే తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్నందున అవసరమైతే బయటకి రావాలన్నారు. ప్రధానంగా కాలనీలలో ఉన్న విద్యుత్ స్థంబాలకు దూరంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని 24గంటలు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఆయా కాలనీవాసులు సమస్యలు ఉంటే వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ రంగయ్య, ఏఈ ప్రవీణ్‌కుమార్, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## వార్డు కార్యాలయాన్ని తనిఖీ చేసిన కార్పొరేటర్



వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, జులై 26 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్‌లోని వార్డు కార్యాలయాన్ని స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డు కార్యాలయం ప్రారంభించిన తర్వాత మొదటిసారిగా కార్యాలయాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ వెంట బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయకుమార్, వార్డు కార్యాలయం సిబ్బంది శ్రీదేవి, వాటర్‌వర్క్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్, పారిశుద్ధ్య సిబ్బందిబాల్‌రాజ్, ఎంటమాలజీ విభాగం నుంచి అంజయ్య, యుబిడి నుంచి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. ఇప్పటివరకు ఆన్‌లైన్ ద్వారా 80, నేరుగా వచ్చిన వారు 9 మంది వివిధ సమస్యలపై ఫిర్యాదు చేశారని, వీటిలో ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులలో 71 ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందని, నేరుగా చేసిన ఫిర్యాదులతో కలిపి మిగిలిన 18 పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు కార్పొరేటర్‌కు వివరించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడానికి చొరవచూపాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులపై, ఫిర్యాదుల వివరాలు పొందుపరిచే రిజిస్టరన పుస్తకాన్ని పరిశీలించారు.

## జీఓ 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం జరిగే పోరాటం చేస్తాం

చిక్కడపల్లి, జూలై 26 ప్రభాతవార్త: జీఓ 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆందోళనకు అండగా ఉంటామని శాసనమండలి సభ్యుడు నర్సిరెడ్డి తెలిపారు. జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ సరైనదేనని, బాధితులకు న్యాయం జరిగే పోరాటం కొనసాగుతుందని అన్నారు. జీవో 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ నిరసన దీక్షకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిందది. పోస్టర్‌ను నర్సిరెడ్డి ఆవిష్కరించి ప్రసంగించారు. వీరి ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం 29న నిరసన దీక్షను పెద్దఎత్తున చేపట్టబోతున్నామని, ఇందులో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పెద్దఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్షుడు చావా రవి, ప్రధాన కార్యదర్శి జంగయ్య, టిఆర్‌టిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, రమేశ్, జీవో 317 బాధిత సంఘం అధ్యక్షుడు విజయకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, మల్లేష్, విద్యాసాగర్, జెస్సీరాణిఃి, వినోద, హారతతి, నారాయణంరెడ్డి, దరశథ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రిష్టియన్ మైనార్టీల సంక్షేమం కోసం సమన్వయంతో పోరాటం

జాషువా పుచ్చకాయల



నూతన కార్యవర్గంతో జాషువ పుచ్చకాయల

కుత్బుల్లాపూర్, జూలై 26 ప్రభాతవార్త : పేద, మధ్యతరగతి క్రిష్టియన్ల సంక్షేమంకోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో తోడ్పాటును అందించాలని నిజాంపేట్ యునైటెడ్ చర్చెస్‌వెల్ఫేర్ అసోసియేస్ నూతన అధ్యక్షులు జాషువా పుచ్చకాయల విజ్ఞప్తిచేశారు. బుధవారం నిజాంపేటలోని మెస్సయ్య ఫుల్‌గాస్పెల్ చర్చిలో జరిగిన సమావేశంలో నర్వాహకులు కల్లోజి రవికుమార్, డాక్టర్. రాజపూడి ప్రదీప్‌ల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యుసిడబ్ల్యుఏ నూతన అధ్యక్షులుగా జాషువా పుచ్చకాయల, ప్రధానకార్యదర్శిగా రవికాంత్ బొల్లిపోగు, కోశాధికారిగా ఫాస్టర్ బి.దయానిధి, ఉపాధ్యక్షులుగా పి.విజయ్‌ప్రకాశ్, పాస్టర్ జి.ఎస్.కుమార్, సహాయ కార్యదర్శులుగా పాస్టర్.ఎం.వి.ఆర్. నెహ్మాయ్య పాల్, ఎ.శ్రీనివాస్, ఉప కోశాధికారులుగా ఆర్. జెర్మియ, పాస్టర్ పిమెన్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ప్రేమ్‌కుమార్, జాన్ స్యామ్యూల్, ఇ.సాలన్‌రాజు, కార్యవర్గ సభ్యులుగా సురేందర్, డ.కిరణ్, సలహాదారులుగా డాక్టర్. ప్రదీప్ సామ్, కె.రవికుమార్, రెవ్.కె.వై. సెల్విస్టర్, రెవ్ . కె.ఇసాక్, ఎ.పరిశుద్ధరావ్, కె.రత్నరాజ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా జాషువా పుచ్చకాయల మాట్లాడుతూ చర్చిలలోని ప్రతిఒక్క సభ్యులకు ఎలాంటి అవసరమొచ్చినీ వారి తరుపున పూర్తిమద్దతుగా నిలుస్తామని హామీఇచ్చారు. క్రైస్తవులపై జరిగేదారుడలను సంఘటితంగా ఎదుర్కొని సంఘంలోని ప్రతిఒక్కరికి సహాయ, సహకారాలను అందిస్తానని హామీఇచ్చారు.

## రోడ్లకు మరమ్మత్తులు చేయించిన బండ్లగూడ మేయర్



బండ్లగూడ కార్పోరేషన్ పరిధిలో
రోడ్లను మరమ్మత్తు చేయిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

నార్సింగి, జూలై 26 ప్రభాతవార్త : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని పలు రోడ్లు గోతులు పడి ప్రజలు, వాహనదారులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ సమస్యలను మంగళవారం మేయర్ మహేందర్‌గౌడ్ కమీషనర్ శరత్‌చంద్ర, ఇతర అధికారుల బృందంను తీసుకెళ్లి చూపించారు. వెంటనే బుధవారం కిస్మత్‌పూర్ నుంచి ఎర్రకుంటకు వెళ్లే రోడ్డుపై మొర్రం వేయించి, జేసీబీల సహాయంతో చదును చేయించారు. ప్రజల ఇబ్బందులను దూరం చేసేందుకే ఈ మరమ్మత్తు పనులు చేపట్టడం జరిగిందని మహేందర్‌గౌడ్ తెలిపారు. కార్పోరేషన్‌లోని అన్ని ప్రాంతాలలో ఉన్న బిటి,సిసి రోడ్లన్నింటికి మరమ్మత్తులు చేయించడం జరుగుతుందని వివరించారు. ప్రజలు వర్షాలు కురుస్తున్న సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని, కరెంటు స్థంభాలను తాకవద్దని, ఇంటిలో, ఇంటి ఆవరణలో నీరు, చెత్త నిలువ కుండా జాగ్రత్త పడాలని తెలిపారు. కాచి వడపోసి, చల్లార్చిన నీటినే తాగాలని, తాజా ఆహార పదార్థాలే తినాలని పేర్కొన్నారు. ఎక్కడైనా చెత్త, వరద నీరు నిలువ ఉంటే వెంటనే స్థానిక కార్పోరేటర్ల దృష్టికి తీసుకెళ్లాలని, వెంటనే సమస్య పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధ్యక్షులు సురేష్‌గౌడ్, డిఇ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



నియామకపు పత్రాన్ని
అందజేస్తున్న తెలంగాణ బీసీ జాగృతి నాయకులు

## తెలంగాణ బీసీ జాగృతి అంబర్‌పేట్ నియోజకవర్గం కన్వీనర్‌గా ఏనుగంటి దిలీప్‌కుమార్ నేత

హైదరాబాద్, జులై 26 ప్రభాతవార్త: తెలంగాణ బీసీ జాగృతి నియోజకవర్గం కార్యవర్గాన్ని బర్కత్‌పురలోని జాగృతి కార్యాలయంలో ఎన్నుకున్నారు. తెలంగాణ బీ.సీ జాగృతి అంబర్‌పేట్ నియోజక వర్గం బీసీ జాగృతి కన్వీనగర్‌గా ఏనుగంటి దిలీప్ కుమార్ నేత, అదేవిధంగా గోల్నాక డివిజన్ దుర్గానగర్‌కు చెందిన పద్మశాలి సంఘం యువజన సంఘం నాయకులు బీసీ జాగృతి అంబర్‌పేట్ నియోజక వర్గం కన్వీనగర్‌గా బీసీ జాగృతి అధ్యక్షులు కే.పీ మురళి కృష్ణలకు బుధవారం నియామకపు పత్రాలను అందజేశారు. అంబర్‌పేట్ నియోజక వర్గంలో బీసీ కులాలను ఐక్యమత్యం చేసి బీసీ హక్కులను, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏనుగంటి దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. తనను నియమించినందుకు అధ్యక్షులు కే.పీ మురళి కృష్ణకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కత్తుల సుదర్శన్ రావు, ప్రధాన కార్యదర్శి బి.లింగం గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అచ్చిన రమేష్, ఉపాధ్యక్షులు పాత కోటి మహేష్, వేణుగోపాల్‌చారి, కార్యదర్శి లాలాగౌడ్ పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్ కార్మికులంతా కెసిఆర్‌కు రుణపడి ఉంటారు: ఎమ్మెల్సీ కవిత



ఎమ్మెల్సీ కవితను సత్కరిస్తున్న తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ పులిమామిడి నారాయణ

చిక్కడపల్లి, జూలై 26 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో వాటర్‌బోర్డు ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచడంతో ఆ వర్గాలు సిఎం కెసిఆర్‌కు రుణపడి ఉంటారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ పులిమామిడి నారాయణ ఆధ్వర్యంలో వాటర్‌బోర్డు ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సిఎం కెసిఆర్ వేతనాలు పెంచడం వల్ల సంతోషం వ్యక్తం చేస్తూ కవితను కలిశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వేముల మారయ్య, ఔట్‌సోర్సింగ్ యూనియన్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, జట్ట జగన్, విజయకుమార్, కమలాకర్, నరేందర్, మహేష్, బాబు, కృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవో 60 ద్వారా వేతనాలు పెరగడానికి సంపూర్ణ సహకారాలు అందించిన ఎమ్మెల్సీ కవితకు కార్మికులు రుణపడి ఉంటారన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులంతా సిఎం కెసిఆర్‌కు మంచి పేరు తెచ్చే విధంగా కష్టపడాలని సూచించారు.

## ఆధ్యాత్మిక గాయకుడు కృష్ణప్రసాద్‌కు సంకీర్తనాచార్య బిరుదు ప్రదానం

చిక్కడపల్లి, జూలై 26 ప్రభాతవార్త: గళంలో మాధుర్యం భాష ఉచ్ఛారణలో స్పష్టత రాగాలాపనలో మెలకువలుతో గుమ్మగట్ల కృష్ణప్రసాద్ సాయిబాబా భజన కీర్తనలు నిరాటంకంగా మూడు గంటల పాటు ఆలపించి శ్రోతలను పారవశ్యంలో ముంచెత్తారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో భక్తిగాన తరంగిణి కార్యక్రమం సంస్థ అధ్యక్షుడు భూపతి కృష్ణకుమార్ నిర్వహనలో కృష్ణప్రసాద్ గానలహరి సాగింది. అనంతరం నిర్వాహకులు, గాన గంధర్వ చల్లా దక్షిణామూర్తి శాలువా, జ్ఞాపికను సత్కరించి 'సంకీర్తనాచార్య' బిరుదును అందించి గౌరవించారు.

## జైఆంధ్ర సమాచార హక్కు సంఘం తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా ఉదయ్‌కుమార్

చిక్కడపల్లి, జూలై 26ప్రభాతవార్త: సాహిత్యరత్న, ప్రముఖ గాయకుడు, ఉదయరాగం సంస్థ అధినేత బబి.ఉదయ్ కుమార్ జై ఆంధ్ర సమాచార సంఘం అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ గౌరవ అధ్యక్షుడుగా బి.ఉదయ్‌కుమార్ నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సుమిత్రానందన్ ఈ మేరకు ఉదయకుమార్ నియామకాన్ని ధృవీకరించారు.

## పూలదండల వ్యాపాలందరికి న్యాయం చేస్తాం

**ఎమ్మెల్యే జాఫర్ హుసేన్ మెరాజ్**



మార్కెట్ కార్యాలయం
వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాఫర్ హుసేన్ మెరాజ్

మెహిదీపట్నం, జులై 26, ప్రభాతవార్త : గుడిమల్కాపూర్ పి.ఇంద్రారెడ్డి పూల మార్కెట్‌లో పూలదండల వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారులందరికి న్యాయం చేస్తానని నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుసేన్ మెరాజ్ అన్నారు. మార్కెట్‌లోని పార్కింగ్ స్థలంలో షాపులను ఏర్పాటు చేసుకొని గత కొంతకాలంగా వ్యాపారాలు కొనసాగిస్తుండడంతో మార్కెటింగ్‌శాఖ అధికారులు షాపులను కూల్చివేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జాఫర్ హుసేన్ మెరాజ్ బుధవారం మార్కెట్‌లో పర్యటించి వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయితో సమావేశమై మాట్లాడారు. మార్కెట్‌లో ఎంతో మంది నిరుపేదలు తమ జీవనోపాదికోసం షాపులను ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరు నిరుపేద కుంటుంబం నుంచి వచ్చిన వారే, వారికి ఎంఐఎం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సహాయంతో ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తాం. మార్కెటింగ్‌శాఖ అధికారులు ఆగస్టు నెల చివరివరకు అవకాశం కల్పించారు. మార్కెట్ నిబంధనల ప్రకారం పూలదండల వ్యాపారాలను నిర్వహించుకునేందుకు షాపులను ఏర్పాటు చేసి ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది. వీరి వెంట మజ్లిస్ పార్టీ నాయకులు, పూలదండల వ్యాపారులు ఉన్నారు.

## సమస్యలను ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదు



డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డికి వినతి పత్రం అందచేసి సన్మానించిన భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త

గోషామహల్, జులై 26 ప్రభాతవార్త: గోషామహల్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలను ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టిం చుకోవడంలేదని తెలంగాణ భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మన్‌రావుగుప్త ఆరోపించారు. ఈ మేరకు బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటి మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డిని కలిసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం అంద చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వర్షం తాడికి అధ్వాన్నంగా రహదారులు మారి,చెత్తా చెదారంతో పాటు డ్రైనేజీలు పొంగ్లి పోర్లుతున్నాయన్నారు. సక్రమంగా వీధి దీపాలు వెలుగడం లేదన్నారు. ఈ విషయమై డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డిని కలిసి సమస్యలు పరిష్కారించే విధంగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భజరంగ్ సేనా గ్రేటర్ కార్యదర్శి వినిత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణపై కేంద్రం దృష్టి సారించడం లేదు



కేంద్ర,రాష్ట్రాల ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్న గ్రేటర్ హైదరాబాద్ మాదిగ హక్కుల దండోరా అధ్యక్షులు పి.శ్యామ్‌కుమార్ తదితరులు

అఫ్జల్‌గంజ్, జూలై 26ప్రభాతవార్త: కేంద్రంలో ఎన్.డి.ఏ అధికారంలో వచ్చిన 100 రోజులలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం పది సంవత్సరాలు కావస్తున్నప్పటికి ఏ మాత్రం వర్గీకరణ పై దృష్టి సారించడం లేదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలల్లో ఎస్సీ వర్గీకణ చేపట్టాలని గ్రేటర్ హైదరాబాద్ మాదిగ హక్కుల దండోరా అధ్యక్షులు పెంజర్ల శ్యామ్‌కుమార్ డిమాండ్ చేశారు.మాదిగల హక్కుల ఆత్మ గౌరవం కోసం మాదిగ హక్కుల దండోరా నిరంతరం శ్రమిస్తుందన్నారు.కాగా భారత దేశంలో ఎస్సీ,ఎస్టీలకు రక్షణ లేకుండా పోతుందని,అంతే కాకుండా మణిపూర్ రాష్ట్రంలో మహిళాలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.ఇటీవల ఆంధ్ర ప్రదేశ్ ఒంగోలులోని జయప్రకాష్ కాలనీలో ఉండే గిరిజనుడు మోటు నవీన్‌పై దాడి చేసి నోట్లో మూత్రం పోసిన వారిన్ని కఠినంగా శిక్షించాలన్నారు. తెలంగాణలో ఓ సర్పంచ్ కుటుంబ సభ్యులు ఏకంగా దళిత మహిళాపై దాడి చేసి దంతాలను ఊడ గొట్టినట్లు అగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా ప్రతినిధులు భీమనపల్లి ప్రభాకర్,కుంట్ల సాయి,ఎ.మోహన్,పి.నాగేష్.పి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు

## విజయ గణపతి లారీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రకాష్‌బాబు గౌడ్



ప్రకాష్ బాబు గౌడ్‌తో అసోసియేషన్ ప్రతినిధులు

అల్వాల్, జూలై 26 ప్రభాతవార్త: అల్వాల్ శ్రీ విజయ గణపతి లారీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రకాష్ బాబు గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం విజయ గణపతి ఆలయం వద్ద ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా బల్వంత్ రెడ్డి, సత్యనారాయణ రావు, నర్సింగ్ రావు, గోవర్ధన్ రెడ్డి, పల్నాటి నర్సింగ్ ప్రధాన కార్యదర్శిగా రాజేష్ గౌడ్ కోశాధికారిగా బాబుతో పాటుగా కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఆరు మంది కార్యనిర్వాహక సభ్యులుగా ఇద్దరిని నియమించారు.

## వాటర్‌బోర్డు కార్యాలయంలో కెసిఆర్, కెటిఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం

చిక్కడపల్లి, జూలై 26 ప్రభాతవార్త: వాటర్‌బోర్డు కార్యాలయంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వేతనాల పెంపు సందర్భంగా సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసే కార్యక్రమం రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ పులిమామిడి నారాయణ, వాటర్‌వర్క్స్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయదవ్, నాయకులు జయరాజు, రాజిరెడ్డి, జాగీరు, లక్ష్మీనారాయణ, అక్తర్ ఆలీ, ఔట్‌సోర్సింగ్ సంఘం నాయకులు విజయకుమార్,నాయకులు సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జయరాజు, రాజారత్నం, సురేశ్‌కుమార్, కమలాకర్, నరేందర్, హరీష్, బాబు, ఆంజనేయులు, కుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. నారాయణ మాట్లాడుతూ వాటర్‌వర్క్స్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల జీతాల పెంపు జీవో 14, 60పై సంతకంచేసిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకు తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహామండలిచైర్మన్ పులిమామిడి నారాయణ, బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్ ధన్యవాదాలు తెలిపారు. అనేక సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న 4వేల మంది ఔట్‌సోర్సింగ్ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేవిధంగా జీతాలు పెంచుతూ, ఉద్యోగ భద్రత కల్పిస్తూ, పిఆర్‌సిలో భాగస్వామ్యం చేసినందుకు సిఎం కెసిఆర్‌కు రుణపడి ఉంటామన్నారు.

## లబ్ధిదారుడికి ఎల్ఓసి అందజేత



ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాలు అందజేస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

కంటోన్మెంట్, జూలై 26 ప్రభాతవార్త: బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి పెన్షన్‌లైన్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అబ్దుల్ కరీం చికిత్స కోసం మంజూరైన (ఎల్ఓసి) ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాలను అతని సోదరుడు ఇంతియాజ్‌కు అందజేశారు. ఈ కార్యాక్రమంలో జక్కుల మహేశ్వర్‌రెడ్డి, ముప్పిడి మధుకర్, విజయ్ పాల్గొన్నారు.

## బాధితునికి లక్ష రూపాయల సిఎం రిలీఫ్‌ఫండ్



ఎల్ఓసిని అందిస్తున్న బిఆర్ఎస్ నేతలు

అల్వాల్, జూలై 26 ప్రభాతవార్త: అల్వాల్‌కు చెందిన రోగికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి లక్ష రూపాయలు ఎల్ఓసి మంజూరైంది. ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు ఆదేశాలుతో ఎల్ఓసిని ఆంథోనికి బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఉదయ్ అందించారు. ఆంథోని గత కొంత కాలంగా అనారోగ్యంతో బాద పడుతున్నాడని పేర్కొన్నారు. ఆర్థిక పరమైన ఇబ్బందులు నేపధ్యంలో విషయం ఎమ్మెల్యే దృష్టికి తెచ్చామని ఉదయ్ తెలిపారు. తక్షణం స్పందించిన ఆయన సిఎం రిలీఫ్ ఫండ్‌కు లేఖ రాయడంతో లక్ష రూపాయలు ఎల్ఓసి మంజూరైందన్నారు.

## అల్వాల్ టౌన్ ప్లానింగ్ ఎసిపిగా సయ్యద్ సయియుద్దీన్ బాధ్యతలు స్వీకరణ

అల్వాల్, జూలై 26 ప్రభాతవార్త: అల్వాల్ టౌన్ ప్లానింగ్ ఎసిపిగా సయ్యద్ సయియుద్దీన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జిహెచ్ఎంసి పలువురు ఎసిపిలను కమీషనర్ బదిలీ చేశారు. కార్వాన్‌లో పని చేస్తున్న సయ్యద్ సయియుద్దీన్‌ను అల్వాల్‌కు ఇక్కడ విధులు నిర్వహించిన విజయశ్రీని కార్వాన్‌కు బదిలీ చేయడం జరిగింది. ప్రజలు ప్రజా ప్రతినిధుల సహకారంతో పట్టణ ప్రగతికి కృషి చేస్తానని నూతన ఎసిపి పేర్కొన్నారు.

## పురాతన భవనాలు కూల్చివేత

అల్వాల్, జూలై 26 ప్రభాతవార్త: వర్షాలు నేపధ్యంలో కూలే స్థితిలో ఉన్న భవనాలపై జిహెచ్ఎంసి చర్యలు ప్రారంభించింది. అల్వాల్ డివిజన్ పరిధిలోని బండ బస్తీలో ఉన్న పాత భవనాన్ని ఎసిపి సయ్యద్ సయియుద్దీన్ పర్యవేక్షణలో సిబ్బంది కూల్చివేశారు. సర్కిల్ పరిధిలోని పాత భవనాలకు నోటీసులు జారీ చేసి కూల్చి వేయడం జరుగుతుందని ఎసిపి స్పష్టం చేశారు. ప్రజలు సహకారంతో ఇది సాధ్యమవుతుందని ఆయన తెలిపారు.

## పేద విద్యార్థులకు స్టేషనరీ వస్తువుల పంపిణీ



నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు

నాచారం. జులై 26 ప్రభాతవార్త: నాచారం మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తిప్పరి రాజా బాబు ఆధ్వర్యంలో పేద మున్నూరు కాపు సంఘం విద్యార్థులకు నోటు పుస్తకాలతో పాటు స్టేషనరీని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజాబాబు మాట్లాడుతూ మున్నూరు కాపుల సంక్షేమం, అభివృద్ధి కోసం తమ వంతుగా కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య పటేల్, రాష్ట్ర కన్వీనర్ బండి పద్మ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మహేందర్ పటేల్, పారిశ్రామిక వేత్త నిమ్మ శంకర్ పటేల్, సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, రాయల కొత్త శ్రీనివాస్, కృష్ణ వేణి తధితరులు పాల్గొన్నారు.

## హోంమంత్రి మహమూద్ అలీని కలిసిన బెంగాలీ సమితి ప్రతినిధులు



చార్మినార్, జూలై 26 ప్రభాతవార్త : రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీ పాతబస్తీకి విచ్చేసిన సందర్భంగా తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్ ఆధ్వర్యంలో పలువురు సమితి ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్, ప్రతినిధులు నస్కర్, సునీల్ అగర్వాల్‌తో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## డంపింగ్‌యార్డు కలుషిత జలాలు

ఘట్‌కేసర్, జూలై 26, ప్రభాతవార్త: జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు కలుషిత జలాల కారణంగా చెరువులో చేపలు చనిపోతున్నాయని బుధవారం మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లోని లక్ష్మీనారాయణచెరువులోకి కాలుష్యపు నీరు చేరడంతో పెద్దసంఖ్యలో చేపలు చనిపోయి ఒడ్డుకు కొట్టుకువచ్చాయి. జవహర్‌నగర్‌లోని డంపింగ్ యార్డు పరసరాల్లోని కలుషిత జలాలు ఎరుమల్లెవాగు ద్వారా లక్ష్మీనారాయణ చెరువులోకి చేరడంతో చేపలు చనిపోయి తమ జీవనోపాధికి నష్టం కల్గుతుందని గంగపుత్ర సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించాలి: ఎమ్మెల్యే



అధికారులతో మాట్లాడుతున్న కాలేరు వెంకటేష్

హైదరాబాద్, జులై 26 ప్రభాతవార్త: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు బుధవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బతుకమ్మకుంట లో పర్యటించారు. ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా బస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను పరిష్కారించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వర్షాల కారణంగా పై ప్రాంతాల నుంచి డ్రైన్ల నుంచి వచ్చే నీరు బతుకమ్మ కుంటలో నిలుస్తు ఒదని, అందువల్ల రోజు డ్రైన్లను డిసిల్టింగ్ చేసి నీటి ప్రవాహం కొనసాగేలా చూడాలని, అలాగే ప్రతి బస్తీలో ప్రతిరోజు పారిశుధ్య నిర్వహణ సక్రమంగా అమలు జరిగేలా చూడాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు డివిజన్‌లో పర్యటించిన కార్పోరేటర్



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, జులై 26 ప్రభాతవార్త: గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు హిమాయత్‌నగర్ డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలను బుధవారం డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. ఆమెతోపాటు యుపిహెచ్‌సి సిస్టర్స్, జలమండలి, మున్సిపల్ అధికారులు ఉన్నారు. వారు అవంతినగర్‌లోని స్ట్రీట్ నెంబరు 2, జనార్దన్ బాడ, దత్తానగర్‌లో పొంగుతున్న డ్రైనేజీని సమస్యను పరిశీలించారు. ఈ డ్రైనేజీ సమ స్యను వెంటనే పరిష్కరించాలని ఆమె జలమండలి అధికారి సన్యాసిరావుకు తెలియజేశారు. ఆదర్శబస్తీలో ఇంటింటికి వెళ్ళి ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండటానికి వారికి జలుబు, దగ్గు, జ్వరం ట్యాబ్లెట్స్‌ను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.రామన్‌గౌడ్, నగర నాయకులు మహేష్, మల్లేష్, సత్య నారాయణలాల్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

సైఫాబాద్, జులై 26 ప్రభాతవార్త: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టె సంక్షేమ పథకాలను గత అర్ధశతాబ్ధకాలంగా అమలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ద్వీతీయ మహాసభ డిమాండ్ చేసింది. లేని పక్షంలో సహించేది లేదని అసోసియేషన్ ప్రతినిధులు హెచ్చరించారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సాయీశ్వరి, నందూరి కరుణకుమారి బుధవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల తమ అసోసియేషన్ ద్వితీయ మహాసభలు కరీంనగర్ పట్టణంలో జరిగాయని, ఈ మహాసభలలో పలు తీర్మానాలు అమోదించడం జరిగిందని తెలిపారు. జివొ నెంబరు 7ను అమలు చేసి అందరికి ఇంటి స్థలాలు, గృహవసతి కల్పించాలని, 40 పూర్తి కాలం వేసవి సెలవులు ఇవ్వాలని, టీచర్లకు, హెల్పర్స్‌కు తక్షణమే వేతనాలు పెంచాలని, ప్రతి ఏడాది వర్కర్స్‌కు, హెల్పర్స్‌కు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అదనపు పనులను రద్దు చేయాలని, అలాగే టిఎ, డిఎ చెల్లించాలని మహాసభలలో తీర్మానం చేయడం జరిగిందని వారు వివరించారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక..** అసోసియేషన్ ద్వితీయ మహాసభల సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. అధ్యక్షురాలిగా సాయీశ్వరి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సరాటి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి నందూరి కరుణకుమారి, ఉప ప్రధాన కార్యదర్శిగా సి.హెచ్.సీతామహాలక్ష్మి, కోశాధికారిగా ప్యారీజాన్, సలహాదారుగా పి.ప్రేమ్‌పావని, గౌరవ అధ్యక్షుడిగా టేకుమల్ల సమ్మయ్య ఎన్నికైనారు.

## త్వరలో ఉద్యోగుల సమస్యలు పరిష్కారం



ఉస్మానియా ఆసుపత్రి ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న టిఎన్‌జిఓ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ

గన్‌ఫౌండ్రి, జూలై 26ప్రభాతవార్త: టి.ఎన్.జి.ఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.ఎం.ముజీబ్ హుస్సేనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యోగుల సమ స్యల పరిష్కారం సభ రెండవ రోజు ఉస్మానియా ఆసుపత్రి ఆవరణలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, ప్రసూతి ఆసుపత్రి పేట్లబుర్జు, డెంటల్ ఆసుపత్రి, సిటి కళాశాల, జూపార్క్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లా ఉద్యోగల అన్ని సమస్యలు త్వరలో పరిష్కరించబడతాయని, పిఆర్‌సి2023 తీపి కబురును ముఖ్యమంత్రి కెసిఆర్ జారీ చేస్తారన్నారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ నిర్మూలన, పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఈ.హెచ్.ఎస్.జి.ఓ 317లో నష్టపోయిన ఉద్యోగులకు, ఇతర ఉద్యోగుల సర్వీస్ విషయాలు వచ్చే నెల 3వ తేదిన ఉస్మానియా మెడికల్ కళాశాల ఆడిటోరియంలో జరిగే సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.విక్రమ్‌కుమార్, కార్యానిర్వాహక అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, కోశాధికారి బాల్‌రాజ్, సభ్యులు కె.శ్రీనివాస్, వైదిక్ శాస్త్రి, బి.శంకర్, శ్రీధర్‌నాయుడు, ముఖీం ఖురేషీ, యూనిట్ విభాగాల అధ్యక్షుల, కార్యదర్శులు ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

## ఛత్రినాక డివిజన్ ఎసిపిగా రమేష్ బాధ్యతలు



చాంద్రాయణగుట్ట, జూలై 26 ప్రభాతవార్త : ఛత్రినాక డివిజన్ ఏసిపిగా జి.రమేష్ బాధ్యతలు స్వీకరించారు. నగర పోలీసు విభాగం పునర్వ్యజనలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రినాక డివిజన్‌కు ఇంజలిజెన్స్ విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న జి.రమేష్‌ను ఛత్రినాక డివిజన్ ఏసిపీగా నియమిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శంషీర్‌గంజ్‌లో ఏర్పాటు చేసిన ఏసిపి కార్యాలయంలో ఇంచార్జి ఏసిపి దామోదర్ రెడ్డి నుంచి మంగళవారం రమేష్ బాధ్యతలు స్వీకరించారు. 1991వ బ్యాచ్‌కు చెందిన రమేషన గతంలో రెయిన్‌బజార్ ఇన్స్‌స్పెక్టర్‌గా బహదూర్‌పురా అదనపు ఇన్స్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి రమేష్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రినాక డివిజన్‌లోని శాలిబండా, మొఘల్‌పురా, ఛత్రినాక పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు.

### చాంద్రాయణగుట్ట డివిజన్ ఏసిపిగా కె.మనోజ్ బాధ్యతల స్వీకరణ

చాంద్రాయణగుట్ట, జులై 26 ప్రభాతవార్త : నగర పోలీస్ పునర్వ్యజనలో భాగంగా నూతనంగా ఏర్పాటైన చాంద్రాయణగుట్ట డివిజన్‌కు ఏసిపిగా కె.మనోజ్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కంచన్‌బాగ్, ఛత్రినాక, అఫ్జల్‌గంజ్, దక్షిణ మండలం టాస్క్ పోర్స్‌లో ఇన్స్‌స్పెక్టర్‌గా పనిచేసిన మనోజ్ కుమార్ 2021 మార్చిలో ఏసిపిగా పదోన్నతి పొంది సీటీసీ ఏసిపిగా పనిచేస్తున్నారు. ఇటీవల ఆయన్ను చాంద్రాయణగుట్ట డివిజన్ ఏసిపిగా బదిలీ చేస్తూ డిజిపి అంజనీ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం సౌత్, ఈస్ట్ డిసిపి రూపేష్‌కు మనోజ్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏసిపి మనోజ్ కుమార్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన చాంద్రాయణ గుట్ట డివిజన్ ఏసిపి పరిధిలో ఉన్న చాంద్రాయణగుట్ట, బండ్లగూడ, కంచన్‌బాగ్ స్టేషన్‌లలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు.

## విశ్వనగరం అంటే ఇదేనా

### డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

సరూర్‌నగర్, జూలై 26 ప్రభాతవార్త: హైదరాబాద్‌ను విశ్వనగరం చేస్తామని ప్రగల్బాలు పలికిన పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ ఇక్కడి రోడ్లు, డ్రైనేజీల పరిస్థితిని గమనించి సమాధానం చెప్పాలని రంగారెడ్డి డిసిసి చల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు నగర శివార్లలోని మీర్‌పేట్ నందిహిల్స్‌లో అధ్వాన్నంగా తయారైన రోడ్లు, డ్రైనేజీలను ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరాన్ని మరో సింగపూర్ చేస్తామని కెటిఆర్ చేసిన ప్రకటనలు గొప్పలకేనని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని దోచుకోవడమే తప్ప ఇక్కడి ప్రజల సమస్యలు బిఆర్ఎస్ పాలకులకు పట్టవని ఆయన విమర్శించారు. అవార్డులు గురించి గొప్పగా చెప్పుకునే కెటిఆర్ నగరాన్ని, శివారు ప్రాంతాలను ఒకసారి సందర్శించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, కీసర యాదిరెడ్డి, సురేందర్‌రెడ్డి, కాల్వ కృష్ణారెడ్డి, జైపాల్‌రెడ్డి, పద్మశ్రీ, సూదిని రాంరెడ్డి, ఆల శ్రీనివాస్‌రెడ్డి, ఎరుకల మురళిగౌడ్ పాల్గొన్నారు.

## ఎంబిఏ, ఎంసిఏ ఇంజనీరింగ్ విద్యార్థులకు పూర్తి ఫీజులు చెల్లించాలి

### బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ, గుజ్జకృష్ణ, అంజి, రామకృష్ణ తదితరులు

హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త: ఎంబిఏ, ఎంసిఏ ఇంజనీరింగ్ చదివే బిసి విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఫీజుల రియంబర్స్‌మెంట్ ప్రకటించాలని బిసి సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ అన్నారు. ఈమేరకు బుధవారం విద్యానగర్‌లోని బిసిభవన్‌లో బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లపల్లి అంజి అధ్యక్షతన జరిగిన సమావేశానికి జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణతో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బిసి, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. ప్రైవేట్ యూనివర్సిటీల్లోనూ బిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రిజర్వేషన్లు అమలు చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా అదనంగా 120 గురుకులాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం మంజూరు చేయాలని లేనిపక్షంలో బిసినాయకులు, విద్యార్థులతో కలిసి ప్రభుత్వంపై ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో విద్యార్థిసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ, పి.సుధాకర్ ముదిరాజ్, మల్లేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా కెసిఆర్ చర్యలు: డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి





సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి

తార్నాక, జులై 26 ప్రభాతవార్త: మైనార్టీల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా మైనారిటీ బంధును సీఎం కేసీఆర్ తీసుకొచ్చారని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి పేర్కొన్నారు. మైనార్టీ బంధు అమలుకై సీఎం కేసీఆర్ జీవో చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షులు మోతె శోభన్ రెడ్డి మైనార్టీ నేతలతో డిప్యూటీ మేయర్ కలిసి తార్నాకలోని క్యాంపు కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కుల వృత్తిదారులు, చేతి వృత్తి దారుల అభ్యున్నతి కోసం రూ.1లక్ష ఆర్థిక సాయం అందజేస్తున్న విధంగానే మైనార్టీలకు రూ.1లక్ష ఆర్థిక సాహాయం అందజేసేందుకు జీవోను తీసుకురావడం జరిగిందన్నారు. కుల మతాలకు అతీతంగా పేదరికాన్ని పారద్రోలేందుకు సీఎం కృషి చేస్తున్నారని కొనియాడారు. విద్య, ఉపాది, తధితర రంగాల్లో ఇప్పటికే పలు పథకాలను అమలు చేస్తూ మైనార్టీల్లో పేదరికాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సీనియర్ నాయకులు ఖాజా పాష, ఎండీ. ఖాజ, ఎండి.ఫయాక్, యాఖుబ్ షరీఫ్, ఎండి. ముజీద్, ఉమర్, సాబేర్‌తో పాటు చంటి కుమార్ పాల్గొన్నారు.

**వర్షపు ముంపు ప్రాంతాల్లో పర్యటించిన డిప్యూటీ మేయర్**

తార్నాకలోని గోకుల్ నగర్ కాలనీలో ఉన్న ఉమా సిగ్నేచర్ టవర్స్ యజమానుల ఫిర్యాదు మేరకు డిప్యూటీ మేయర్ అధికారులతో కలిసి అపార్ట్‌మెంట్‌కు వెళ్లి అక్కడ నెలకొన్న డ్రైనేజీ పైపు లైన్ సమస్యను అడిగి తెలుసుకున్నారు.



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న అధికారులు, బీఆర్ఎస్ నేతల

## అభివృద్ధి పనుల పరిశీలన

అడ్డగుట్ట, జూలై 26 ప్రభాతవార్త : అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు డివిజన్‌లోని సీఅండ్‌డీ కాలనీలో జరుగుతున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ సహకారంతో డివిజన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా పరిపాలన అందిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌కు దక్కుతుందని తెలిపారు. ఈ కార్యాక్రమంలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, జీహెచ్ఎంసీ డీఈ పద్మలత, ఏఈ వేణు, నేతలు వద్దూరి రవి, గోపి, రోజా పాల్గొన్నారు.

## భగవత్‌గుడాలో కార్పొరేటర్ పర్యటన



స్థానిక బస్తీ వాసుల సమస్యలను తెలుసుకుంటన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 26 ప్రభాతవార్త : మైలార్ దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి బుధవారం బుద్వేల్‌లోని భగవత్‌గుడాలో ఆకాల వర్షాలకు కూలిన పాత ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇండ్లు కూలి పోయిన వారిని అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ప్రెశిడెంట్ రాజ్‌కుమార్, లంకల సాయి, పవన్ పాయి, పాండు యాదవ్, శ్రీ కాంత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మణికొండలో ఈవిఎంల పనితీరుపై అవగాహన



మణికొండలో ఈవిఎం మిషన్ పనితీరుపై అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ అశోక్‌రెడ్డి

నార్సింగి, జూలై 26 ప్రభాతవార్త : గండిపేట మండలం మణికొండ ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికల సూపర్ వైజర్లు స్థానిక నాయకులు, ప్రజలకు ఇవిఎం మిషన్ల పనితీరుపై అవగాహన కల్పించారు. ఈ ఈవిఎంలను మణికొండ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొండకల్ల రామకృష్ణా రెడ్డి, తదితర బిఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల కోసం అధికారులు ఇప్పటి నుంచే పనులు ప్రారంభించారని తెలిపారు. ఈవిఎంలను పరిశీలించి, మొరాయించే వాటిని మరమ్మత్తు చేయించనున్నట్లు తెలిపారని పేర్కొన్నారు. ఏ గుర్తుపై నొక్కుతామో అదే గుర్తుకు ఓటు పడుతుందని, ఈవిఎంల పనితీరుపై ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఒక గుర్తుపై నొక్కితే మరో గుర్తుపై ఓటు పడుతుందన్నది కేవలం అపోహ మాత్రమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధ్యక్షులు శ్రీరాములు, పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్, ఎలక్షన్ బిఎల్ఓలు కుమార్, లక్ష్మీ, సరస్వతీ, బిఆర్ఎస్ నాయకులు శ్రావణ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

### జాతరను జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేసిన ముప్పిడి

బేగంపేట జులై 26,ప్రభాతవార్త : బాలంరాయి దండు మారెమ్మ ఆలయంలో బోనాల జాతరను విజయ వంతం చేయడంలో సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ఆలయ మండపం నిర్మాణ దాత, ముప్పిడి గోపాల్ కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భం గా ఫలహారం బండి తీసిన బి.ఎల్.ప్రమోద్‌కుమార్ ను ముప్పిడి శాలువాతో ఘనంగా సత్కరించారు. అమ్మ వారి జాతర సమయంలో బస్తీ వాసులంతా ఒక్కటిగా ఉండి జయప్రదం చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఏటా అమ్మ వారి జాతరను ఇలాగే నిర్వహించడంలో బస్తీ వాసులు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, సంజయ్, ప్రవీణ్, దర్గా రవి తదితరులు పాల్గొన్నారు.

### బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో కమిషనర్, డిఇఇలతో మేయర్ సమావేశం

సరూర్‌నగర్, జూలై 26 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల వల్ల తలెత్తిన ప్రజా సమస్యలు, వాటిని పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక తయారు చేయాలని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం సాయంత్రం ఆమె తన కార్యాలయంలో కమీషనర్ బడుగు సుమన్‌రావు, డిఇఇలు అశోక్‌రెడ్డి, జ్యోతి తదితరులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వర్షాలు.. తలెత్తుతున్న సమస్యలపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రణాళిక అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నాగేశ్ బాబు, ఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎఇఇ వినీల్‌గౌడ్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ వి.యాదగిరి పాల్గొన్నారు.


**PUBLIC NOTICE**

Notice to all General Public that My Clients **Janardhan Jala,** S/o Late Achaiah, aged about 76 Years, Occ: Retired Engineer and Smt. Damayanthi Jala, W/o Janardhan Jala, aged about 71 Years, Occ: Home Maker, both are resident of 7014, HUNTERS RIDGE, WOODSTOCK, GEGIA, U.S.A had revoked and canceled the Notarized General Power of Attorney, dt. 23.10.2018 and which was validated subsequently before the O/o The District Registrar, at Hyderabad executed in favour of K. Laxman Rao, S/o Late K. Pandurangam by issuing a mail, dt.22.07.2023 and Advocate Notice. Hence General public are hereby cautioned not to enter into any transaction with K. Laxman Rao, S/o Late K. Pandurangam in respect of the Flat No.101 (Front side) at 1st Floor, Flat No.202 in 2nd Floor and Flat No.402 (Rear side) in 4th Floor in the residential apartment known as "JALA'S GOLDEN TOWERS", bearing Municipal No.2-2-647/77/g/30, together with land admeasuring 472.22 Sq.Yards or 394.82 Sq.Meters at Plot No.30, situated at SBI colony, Bagh Amberpet, Hyderabad, Telangana State, India, that inspite of this public notice any person(s) enter into any agreement in respect of the above mentioned property the same shall be at their sole risk and consequences and the same shall not be binding on my client.

**J. ANANTH RAM**
**ADVOCATE**
H.No.13-3-1110/9, Sree Neel Kant Nagar, Jiyaguda, Hyderabad-06
**Mobile No.8978628234, 9000456827**

**IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT L.B.NAGAR**
**O.S.NO.446 OF 2023**

**Between:**
1. Andhadugula Rajendhar, S/o.Late A.Balaiah, M/o Late A. Sashikala, Aged about 47 years,Occ: Private Employee, R/o.H.No.3-305/3, Tirumala Hills, Meerpet, Saroornagar, Ranga Reddy Dist, Telangana-500079.
2. Andhugula Narsing Rao, S/o. Late A.Balaiah, M/o Late A.Sashikala, Aged about 45 years, Occ: Business, R/o. H.No.3-305/3, Tirumala Hills, Meerpet, Saroornagar, Ranga Reddy Dist, Telangana-500079.
3. Kuturu Madavi. D/o Late Balaiah, M/o A. Sashikala, Aged about 41 years. Occ: Housewife, R/o H.No.5-85, Mudiraj Basthi. Ibrahimpatnam, Ranga Reddy dist. Telangana -501508.

....**PLAINTIFFS**

**AND**

1. The Thahsildhar, Balapur Mandal, Old Saroornagar, Ranga Reddy District, TS.
2. All Concerned

....**DEFENDANTS**

Whereas the above named plaintiffs are filed the above case to declare the plaintiffs are the successors and only legal heirs of deceased Late. Andhadugula Shashikala W/o. Balaiah and the above matter is posted on **01-08-2023** for appearance of any persons for objections. The Hon'ble court was pleased to direct to take out notice through paper publication. Hence, take notice as the case is posted on **01-08-2023** at **10.30 A.M,** Kindly appear in persons or through your counsel on the said case date.

**SCHEDULE OF PROPERTY**

All that piece and parcel of land bearing plot No.57 and 56 part, in survey No. 16, 18 & 19, admeasuring 180 sq. yards or equivalent to 150.50sq. mtrs., Block No. 5, of situated at RN Reddy Colony, Meerpet village, Saroornagar Rev. mandal, Ranga Reddy District. Under Meerpet Grampanchayat with in the jurisdiction of sub register Sagar Ring Road under LB Nagar municipality, Ranga Reddy Dist.and bounded by: **East:** 25 feet wide road, **WEST :** Plot No. 44 & 45, **SOUTH:** Plot No.56, **NORTH:** Plot No.58.

// By Order of the Court//
Sd/-**DURGAPURAM VIJENDER,**
Advocate
H.No.8-1-15/27, Padma Nagar Colony, Karmanghat, Saroornagar, Hyderabad-500079, TS
**Ph.No.9581065399.**

వార్త VAARTHA CLASSIFIEDS

**CHANGE OF NAME**

★ I, **Sri. Kodipaka Anjaneyulu** S/o.Late K. Lingam, R/o.H.No.12-11-1726, Amber Nagar, New Nallakunta, Hyd. Changed my Daughter Name From Kodipaka Bhavatyaa to **Kodipaka Aarya Sree.**

**LOST**

★ I, Lalitha OBILI D/O NARSIMHULU OBILI LOST PASSPORT WITH PASSPORT NO: L4105843, RESIDENT OF Vasavi GP Trends, Financial District, Nanakaramguda, TS 32 I LOST MY PASSPORT WHILE I WAS TRAVELLING FROM MY RESIDENCE TO MY OFFICE AT MADHAPUR IF ANY ONE FINDS STUDIO L RR Towers, Kavuri Hills, Jubilee Hills, Hyd TS **Cell 8464012101.**

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవసలిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ GHMC

నిట్ నం.31/DIV.13 (Old-7B)/GHMC/2023-24
పని పేరు: సివిల్ పని (1నం.) అంచనా మొత్తం: రూ.39.50 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: 27.07.2023 సా.04.00 గం. నుండి 31.07.2023 సా.04.00 గం. వరకు. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నం.13, (పాత-7B) (KZ), GHMC, ఖైరతాబాద్, హైదరాబాద్ 9154960552. తదుపరి వివరాలు www.Tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నం.13 (పాత-7B), GHMC
DIPR.No.4695-PP/CL/Advt/1/2023-24, తేది: 26.07.2023

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ GHMC
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన

నిట్ నం.20/EE/Div-29/SBZ/GHMC/2023-24, తేది: 26.07.2023, ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫాంపై ప్రచురింపబడింది. 1) సికింద్రాబాద్ సర్కిల్-29, GHMC వివిధ వార్డులలో సీసీ రోడ్లు వేయుట. 27 నం.ల పనులు. వివరాలను https://www.tender.telangana.gov.in లాగిన్ అయి చూడవచ్చును. తేదీల వివరాలు ఈ క్రింది విధంగా: నిట్ నం: పైన పేర్కొన్నది. పని పేరు: పైన పేర్కొన్నది. అంచనా మొత్తం/ECV లక్షలలో: 703.80, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: 01.08.2023 సా.4.00 గం. నుండి 07.08.2023 సా.4.00 గం. వరకు. సంబంధిత అధికారి పేరు, చిరునామా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, GHMC సికింద్రాబాద్, సెల్ నం: 9963550657. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, సికింద్రాబాద్, GHMC
DIPR.No.4687-PP/CL/Advt/1/2023-24, తేది: 26.07.2023

# ఎస్ఎన్‌డిపీ పనులతో సత్ఫలితాలు : ఎమ్మెల్యే, కమిషనర్



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రోనాల్డ్‌రోస్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూలై 26 ప్రభాతవార్త :** ఎస్ఎన్‌డిపీ పనుల నిర్వహణ సత్ఫలితాలు ఇస్తున్నాయని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపధ్యంలో బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్‌తో కలిసి గడ్డిఅన్నారం, లింగోజిగూడా డివిజన్లలో పర్యటించి వీవీనగర్‌లో జరుగుతున్న పైపులైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ 2016లో డ్రైన్స్ నిర్మాణం పనులు చేపట్టామని, డ్రైన్‌లో పెద్ద మొద్దులు, చెద్దర్లు వేయడం వల్ల మురుగునీరు కాలనీలోకి వెళ్లడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సరూర్‌నగర్ చెరువువద్ద చెత్తను నివారించేందుకు పెద్ద గ్రిల్స్ నిర్మించాలని కోరారు. లింగోజిగూడా డివిజన్ అల్తాఫ్‌నగర్ వద్ద జరుగుతున్న డ్రైన్స్ పనులను, బైరామాల్‌గూడ చెరువును పరిశీలించారు. సరూర్‌నగర్ చెరువులో మూడో గేటు ఏర్పాటు చేయడం వల్ల కోదండరాంనగర్, వీవీనగర్ కాలనీలు ముంపు సమస్యల నుంచి విముక్తి లభించిందని తెలిపారు. ఇప్పటికే 80శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ వివినగర్‌వద్ద జరుగుతున్న డ్రైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సరూర్‌నగర్ చెరువులో మొద్దులు, చెద్దర్లు, ఇతర వస్తువులు వేయకుండా చూసుకోవాలి అని సిబ్బందిని ఆదేశించారు. అల్తాఫ్ నగర్ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. బైరామల్‌గూడ చెరువును రాబోయే రోజుల్లో సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జోనల్ కమి షనర్ పంకజ, ఉపకమిషనర్లు అరుణ, రవీందర్, మాజీ కార్పొరేటర్లు భవాని ప్రవీణ్‌కుమార్, ముద్రబోయిన శ్రీనివాసరావు, నాయకులు బిచేనేపల్లి వెంకటే శ్వరరావు, శ్రీశైలంయాదవ్, వరప్రసాద్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ రోడ్డు మరమ్మతులకు కేంద్ర నిధులు : మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్


Government of India
Ministry of Road Transport & Highways
REGIONAL OFFICE, HYDERABAD

కేంద్రం నుంచి నిధులు ఇచ్చిన జివో కాపీ విడుదల చేసిన బిజెపి నేతలు

**ఉప్పల్, జూలై 26 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు మరమ్మతులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహకారంతో కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంనుంచి నిధులు విడుదల చేసిన పత్రాన్ని ఆయన మీడియాకు విడుదల చేశారు. కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి ఉప్పల్ ప్రధాన రహదారి సమస్యను తీసుకెళ్లగా ఆయన యుద్ధప్రాతిపదికన రోడ్డు నిర్మాణం చేపట్టాలని రూ.ఒక కోటి రూ.69లక్షల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెల 28న పనులను ప్రారంభించాలని కేంద్ర మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ఆర్ అండ్ బి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రోడ్డు తామే వేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. కేంద్రం సహకారంతోనే రోడ్డు మరమ్మతులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. బిఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం మానుకోవాలని కోరారు.

## ఘనంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న చెకోలేకర్ తదితరులు

**మలక్‌పేట, జూలై 26 ప్రభాతవార్త :** సలీంనగర్‌లోని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మలక్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఉత్సవాల ముగింపుకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. చెకోలేకర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఘటాలను ఊరేగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల ఉత్సవాలు సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో యాదిలాల్, కృష్ణలతోపాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో కొనసాగుతున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పాదయాత్ర

**ఉప్పల్, జూలై 26 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పాదయాత్ర నిర్వహించారు. రామంతాపూర్ ఆర్టీసీ కాలనీ, ఎండోమెంట్‌కాలనీ, భరత్‌నగర్, నెహ్రూనగర్, శారధనగర్, పాతరామంతాపూర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నెహ్రూనగర్‌లో రోడ్లపైనవేసిన చెట్టుకొమ్మలు తొలగించాలని,పాత రామంతాపూర్‌లో డ్రైనేజీ, సిసి రోడ్డు వేయాలని స్థానికులు విన్నవించారు.అనంతరం నెహ్రూనగర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఉప్పల్ ప్రధాన రహదారిలో వర్షం కారణంగా రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలించి నీరు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.ముస్తాక్, నేతలు వెంకటేశ్వరరెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, లేతాకుల రఘుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, లక్ష్మినారాయణ, వి.గోపాల్‌రెడ్డి, కుమారస్వామి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాగోల్ సిఐ వెంకటేశ్వర్లుకు ఉప్పల సన్మానం

**ఎల్.బి.నగర్, జూలై 26 ప్రభాతవార్త :** నాగోల్ నూతన పోలీస్‌స్టేషన్‌లో సిఐగా బాధ్యతలు తీసుకున్న వెంకటేష్ మంగళవారం నాగోల్‌లో ఉప్పల శ్రీనివాస్‌గుప్త క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్త సిఐ వెంకటేశ్వర్లును ఉప్పల శ్రీనివాస్ గుప్తా శాలువతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. పోలీస్ శాఖలో మంచిపేరు సంపాదించుకోవాలని, శాంతిభద్రతల విషయంలో తాము కూడా పోలీసులకు సహకారమందిస్తామని ఈ సందర్భంగా ఉప్పల తెలిపారు.

## పూసల కులాన్ని ఎంబిసిలో చేర్చాలని వినతి

**సరూర్‌నగర్, జూలై 26 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో పూసల కులాన్ని ఎంబిసి జాబితాలో చేర్చడానికి సహకరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోల శ్రీనివాస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవితను కోరారు. బుధవారం ఆయన సంఘానికి చెందిన పలువురితో కలిసి కవితకు ఒక వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూసల కులాన్ని మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాస్‌లో చేర్చడానికి సిఎం కెసిఆర్‌కు సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేని వెంకటేశం, కోశాధికారి కంచి మధుసూదన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని సిపిఎం నాయకుల డిమాండ్

**ఎల్.బి.నగర్, జూలై 26 ప్రభాతవార్త :** మణిపూర్‌లో జరుగుతున్న అలజడిని అరికట్టడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే భర్తరఫ్ చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్ మారణహోమంపై మణిపూర్ ప్రభుత్వంను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్‌కేపురం డివిజన్ యన్‌టిఆర్‌నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సిపియం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సిపియం పార్టీ సరూర్‌నగర్ సర్కిల్ కార్యవర్గ సభ్యులు యం.గోపినాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి వెంకన్న, సర్కిల్ కమిటీ సభ్యులు కట్ట శ్రీనివాస్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో గత 80 రోజులుగా మారణ హోమం జరుగుతున్నదని, వందల మంది ఆదివాసి తెగలు, మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ సామూహికఅత్యాచారానికి పాల్పడుతూ భారతావని సిగ్గుతో తలదించుకునే విధంగా జరుగుతున్నా బిజెపి ప్రభుత్వం ఆ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పడంలో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాళ్ళ జంగయ్య, వీరయ్య, యాదయ్య, రాజు, ఎండీ సలీమ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు:శ్రీవాణి



డ్రైనేజీ సమస్య పరిశీలిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, జూలై 26 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్ ఇందిరానగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రామంతాపూర్ ఇందిరానగర్ మెట్ల గల్లీ నుంచి మార్కండేయస్వామి గుడి వరకు డ్రైనేజీ సమస్య పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కొత్త పైప్‌లైన్ వేయిస్తామన్నారు. డ్రైనేజీ సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రవీందర్, సూపర్‌వైజర్ కిషన్, డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, స్థానిక నేతలు పూస సత్యనారాయణ, వెంకటాద్రి, నేతలు నగేష్, నిరంజన్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మూసీపరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసు అధికారులు



మూసారాంబాగ్ బ్రిడ్జి వద్ద పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ డిసిపి శ్రీనివాస్, ఎసిపి సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

**మలక్‌పేట, జూలై 26 ప్రభాతవార్త :** వర్షాలు భారీగా కురుస్తున్న నేపథ్యంలో మలక్‌పేటలో ట్రాఫిక్ సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి శ్రీనివాస్, ఎసిపి సత్యనారాయణ,ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్‌లు సిబ్బందితో కలిసి పర్యటించారు. మూసారాంబాగ్ బ్రిడ్జివద్ద మూసీ పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. అదేవిధంగా మలక్‌పేటలో అక్షయ హోటల్‌వద్ద నీరు నిలిచిపోయిన ప్రాంతాలను, యశోద ఆసుపత్రి వద్ద పెలికాన్ సిగ్నల్స్‌ను పరివీలించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వర్షపు నీరు నిలువకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డిసిపి శ్రీనివాస్ పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ బోధన

**రామంతాపూర్, జూలై 26 ప్రభాతవార్త :** రామంతాపూర్ ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ విద్యను ప్రవేశపెట్టినట్లు హెచ్ఎం సాంబయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఏపమ్ సహకారంతో పాఠశాలలో 20 కంప్యూటర్లు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మంగళవారం నుంచి వర్చువల్ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. మన ఊరు, మన బడి కార్యక్రమంలో భాగంగా అన్ని తరగతి గదులను స్మార్ట్ క్లాస్ రూమ్స్‌గా తీర్చిదిద్దుతున్నామని, సోలార్ ప్యానల్ ఏర్పాటుతో నిర్వారామంగా స్కూల్‌లో విద్యుత్ పొందుతున్నామని తెలిపారు. కంప్యూటర్ విద్యతో పర్యావరణం గురించి అమెరికాలోని పర్యావరణవేత్తలతో విద్యార్థులు సంభాషించినట్లు తెలిపారు. దాతల సహకారంతో అధునిక మరుగుదొడ్లు, బోర్‌వెల్స్‌ద్వారా నీటిని ఏర్పాటు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

## పారిశ్రామిక వేత్తలకు అండగా నాచారం ఇండస్ట్రీస్ అసోసియేషన్ : సుధీర్‌రెడ్డి




అవార్డును అందుకుంటున్న పారిశ్రామిక వేత్త వెంకట్‌రెడ్డి

**నాచారం, జూలై 26 ప్రభాతవార్త :** పారిశ్రామిక వేత్తలకు అండగా నాచారం ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఉంటుందని తెలంగాణ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ అధ్యక్షులు కె.సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నాచారం ఇండస్ట్రీస్ అసోసియేషన్ భవనంలో పారిశ్రామిక వేత్తలు, సిబ్బంది కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఎన్ఐఏ వెబ్‌సైట్, ఫిట్‌నెస్ సెంటర్, లైబ్రరీని టిఎస్ఐఐసీ ఎండి ఐఏఎస్ అధికారి ఇ.వి. నర్సింహ్మారెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు డి.కె.జైన్, ఫెటసియా (తెలంగాణ ఇండస్ట్రీస్ ఫెడరేషన్) అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తలకు, ఉద్యోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వెబ్‌సైట్, ఫిట్ నెస్ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నాచారం పారిశ్రామి వాడలో ఏర్పాటు చేసిన పరిశ్రమల ద్వార ఎంతో మందికి ఉపాధి కల్గుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామిక వేత్తలకు ఆవార్డులను వారు అందజేశారు. ఈ సందర్భంగా యువ పారిశ్రామిక వేత్త, రెడ్డీస్ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్ యజమాని ఎ.వెంకట్‌రెడ్డికి యంగ్ అచీవర్స్ అవార్డు లభించింది. ఈ అవార్డును టిఎస్ఐఐసీ జిఎం బి.మాధవి చేతుల మీదుగా ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. అవార్డు వరించడం సమిష్టి కృషి అన్నారు. కార్యక్రమంలో టిఎఫ్ ప్రసిడెంట్ సుధీర్‌రెడ్డి, నాచారం ఇండస్ట్రీస్ ఉపాధ్యక్షులు వి.టి.శివ, కార్యదర్శి ఎన్.సురేందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ వి.జైరాజ్, కోషాదికారి భాన్‌జీ పటేల్, సభ్యులు పి.సత్తిరెడ్డి, విజయేంద్ర బాజ్‌పాయ్, వి.వెంకటేశ్వర్ రావు, కమల్ పెద్దింటి, వినయ్‌కుమార్ జైన్, మనోజ్ మక్‌దాని, బి. తిరుపతి రెడ్డి, రాము మల్‌జీతో పాటు వివిధ కంపెనీలకు చెందిన పారిశ్రామిక వేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## బంగారు తెలంగాణ అంటే ఇదేనా?: మేయర్ పారిజాత, అమరేందర్‌రెడ్డి



డ్రైనేజీ నీటితో మడుగులా తయారైన రోడ్డులో కెటిఆర్ ఫ్లెక్సీని ఉంచి ఆందోళన వ్యక్తం చేస్తున్న పారిజాత, అమరేందర్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జూలై 26 ప్రభాతవార్త:** వర్షాలకు రహదారులు చెరువులుగా మారడం..డ్రైనేజీలు పొంగి ప్రవహించడం... ఇదేనా బంగారు తెలంగాణ అంటూ తెలంగాణ పిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింగ పారిజాత నర్సింహారెడ్డి, టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్ రెడ్డిలు ఎద్దేవా చేశారు. వర్షాలకు అధ్వాన్నంగా మారిన బాలాపూర్ సమీపంలోని బిలాల్ కాలనీలో బుధవారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులతో కలిసి చెరువుల్లా మారిన రోడ్లు, పొంగి ప్రవహిస్తున్న డ్రైనేజీలను పరిశీలించారు. అధ్వాన్నంగా మారిన డ్రైనేజీనీరు నిండిన రోడ్డుపై మంత్రి కెటిఆర్ ఫ్లెక్సీని ఉంచి ఇదీ బంగారు తెలంగాణ అంటూ ఎద్దేవా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణకు అవార్డులు, వస్తున్నాయని కెటిఆర్ జల్‌పల్లి మున్సిపాలిటీని పరిశీలించి చెప్పాలని డిమాండ్ చేశారు. నగరానికి కూతవేటు దూరంలో ఉన్నా జల్‌పల్లి మున్సిపాలిటీలో ప్రజలకు ఇలాంటి దుస్థితి ఉండడం విచారకరమని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదనీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అహ్మద్ బామ్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, సీనియర్ పార్టీ నాయకుడు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ బండారి మనోహర్, ఎర్ర జైహింద్‌కుమార్, వంగేటి మధుసూదన్‌రెడ్డి, బాల్‌నింగని జంగయ్య, టేకుల సుధాకర్‌రెడ్డి, సాదిక్, అబ్దుల్ రజాక్, ఖయ్యూం ఖాన్, ఎక్బాల్, అబూ బిన్‌అలీ, నిజాం తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ కార్పొరేషన్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన మేయర్ దుర్గాదీప్‌లాల్‌చౌహాన్



డిఇని వివరాలు అడుగుతున్న మేయర్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్

**సరూర్‌నగర్, జూలై 26 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్‌లో నూతనంగా నిర్మిస్తున్న కార్పొరేషన్ భవన నిర్మాణ పనులను బుధవారం స్థానిక మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్ పరిశీలించారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 15వ డివిజన్‌లో నిర్మాణంలో ఉన్న కార్పొరేషన్ భవనాన్ని ఆమె డిఇ గోపినాథ్, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి తదితరులతో కలిసి పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా నిర్మాణ వివరాలను ఆమె డిఇని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పనులను వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరలో కార్పొరేషన్ కొత్త భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇ శ్రీనివాసులు, కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుంతలమయమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టండి : కార్పొరేటర్ లచ్చిరెడ్డి



గుంతల రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, జూలై 26 ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ లేబర్ అడ్డా వద్ద వర్షాల కారణంగా రోడ్లు గుంతలు పడి ఇబ్బందికరంగా ఉందని కాలనీవాసులు డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి తెలియజేసారు. దీంతో కార్పొరేటర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి అట్టి రోడ్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ రోడ్డును బాగు చేయిస్తానని సంబంధిత జిహెచ్ఎంసి అధికారులు డిఇ దామోదరరావు, ఏఈ రాకేష్‌లకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారప్రతినిధి శరత్‌కుమార్, నాయకులు న్యూట్రాన్, జైపాల్‌రెడ్డి, కామేష్, పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుంతల రోడ్లకు మరమ్మతులు చేయండి : కార్పొరేటర్ కక్కిరేణి చేతన

**ఉప్పల్, జూలై 26 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ నవరంగ్‌గూడ, కామాక్షిపురంలో గుంతలు పడిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి రోడ్ల సమస్య పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నవరంగ్‌గూడ, కామాక్షిపురంలో వరదల కారణంగా ఏర్పడిన గుంతలను వెంటనే మరమ్మతులు చేపట్టాల ని ఆదేశించారు. నవరంగ్‌గూడ కమ్యూనిటిహాల్ రిపేరు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఇ నాగమణి, జలమండలి ఎఇ రవీందర్, కిషన్, డివిజన్ కార్యదర్శి చెల్లోజు ఎల్లాచారి, నేతలు రంగమ్మ, హరిబాబు, తుమ్మల రవి, రఘు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




## ఉప్పల్ ప్రధాన రహదారిలో వరద నీరు తొలగింపు : ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



వరద నీటిని తొలగించే పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేతి తదితరులు

**ఉప్పల్, జూలై 26 ప్రభాతవార్త :** ఉప్పల్ ప్రధాన రహదారిలో రోడ్లపై నిలిచిన వరద నీటిని తొలగించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఉప్పల్ ప్రధాన రహదారిలో నల్ల చెరువు వద్ద నిలిచిన వరద నీటిని అధికారులతో కలిసి పరిశీలించారు. వాహనదారులకు ఇబ్బంది కలుగకుండా నీటిని తొలగించినట్లు తెలిపారు. సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు త్వరలోనే వరంగల్ జాతీయ రహదారికి మరమ్మతులు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాస్ రావు, సిఐ అశోక్, ఆర్‌అండ్‌బి ఎఇ గోపికృష్ణ, మున్సిపల్ ఇంజనీర్ ఎల్.నాగేందర్, డిఇ నిఖిల్‌రెడ్డి, నేతలు రఘుపతిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సంతోష్ రెడ్డి, కృష్ణారెడ్డి, అన్య వెంకటేష్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి :బలాల



సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట, జూలై 26 ప్రభాతవార్త :** భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రేటర్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించడంతోపాటు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షపు నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సాలం షాహిద్, మినాజుద్దీన్, నాయకులు అబ్రార్, షఫీ, అధికారులు పీర్‌సింగ్, మల్లికార్జున్, రఘువీర్ ప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు



ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న పటేల్ సునీతరెడ్డి

**ఎల్.బి.నగర్, జూలై 26 ప్రభాతవార్త :** ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ సాయిబాబానగర్‌లో పలహారం బండి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఫలహారంబండి ఊరేగింపు కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనాథ్, లోకేష్, నితీష్, శంకర్, జహీరా, సాయి తదితరులు పాల్గొన్నారు.

## డిసిహెచ్ఎస్ హాస్పిటల్స్ సూపరింటెండెంట్ రాజుకు ఏరియా ఆసుపత్రి సిబ్బంది సత్కారం



డాక్టర్ రాజును అభినందిస్తున్న ఏరియా హాస్పిటల్ సిబ్బంది

**వనస్థలిపురం, జూలై 26 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా డిసిహెచ్ఎస్ హాస్పిటల్స్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ గజ్జి రాజు వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ సందర్శించారు. హాస్పిటల్ సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లో సమస్యలపై డిసిహెచ్ఎస్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేసారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకం బిక్షపతి, అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ శాంతి కుమార్, వెల్నెస్ సెంటర్ ఇన్చార్జ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సమీర్, డ్యూటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జరీనా పర్వీన్, జిల్లా యూనియన్ అధ్యక్షులు నర్సింగ్, రాజేష్, అనిల్ గౌడ్, ఆగయ్య, ప్లంబర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

